జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 19-3-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 279 పేజీలు: 4 వెల : రూ.7

# పవర్ పెట్రోల్ పేరిట.. మోసం



* వాహనచోదకులను దోచేస్తున్న పలు పెట్రోల్ బంకుల నిర్వాహకులు * ఆందోళన వ్యక్తం చేస్తున్న వాహనచోదకులు * మొక్కుబడిగా తనిఖీలు చేస్తున్న సంబంధిత అధికారులు



**పలాస, మార్చి18 (వార్త):** పెట్రోల్ బంకుల నిర్వాహకులు కొందరు పవర్ పెట్రోల్ పేరిట దోచేస్తున్నారు. పెట్రోల్ బంకుల్లో అవినీతి, అక్రమాలపై సంబంధిత అధికారులకు వాహనచోదకులు ఫిర్యాదులు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఒకవేళ స్పందించినా మొక్కుబడిగా తనిఖీలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా పెట్రోల్ బంకుల నిర్వాహకులు కొందరు పవర్ పెట్రోల్ వేస్తే వాహనాలకు మంచి మైలేజీ వస్తుందని, ఇంజిన్ బాగుంటుందని చెబుతూ సరికొత్త మోసానికి పాల్పడుతున్నారని వాహనచోదకులు వాపోతున్నారు. ప్రస్తుతం ఏ పనికి బయటకు వెళ్లాలన్నా వాహనం తప్పనిసరి. దీంతో ప్రతి ఒక్కవాహనచోదకుడు తప్పనిసరిగా పెట్రోల్ పోసుకోవాల్సిందే. దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు పెట్రోల్ బంకుల యజమానులు అక్రమాలకు పాల్పడుతున్నారు. పెట్రోల్ కొట్టడం ప్రారంభించగానే 1,2,3 రీడింగ్ కనిపించకుండా నేరుగా 5,6,7,8కు కొన్నిసార్లు జంప్ అవుతుంది. ఇలా చేయడం రావాల్సిన పెట్రోల్ కన్నా తక్కువగా వస్తుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరైతే మాటల్లో పెట్టి గారడీ చేసి తక్కువ పెట్రోల్ వేస్తున్నారు. పలాస - కాశీబుగ్గలోని పెట్రోల్ బంకుల్లో ఇటువంటి దందా ఎక్కువగా సాగుతోందని వాహనచోదకులు విమర్శిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి పెట్రో దందాపై తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

# కట్టుకున్నోడే.. కడతేర్చాడు



* తాగిన మత్తులో భార్యతో వాగ్వాదం
* ఆపై కత్తితో భార్య తల, మెడపై కత్తితో దాడి
* అక్కడికక్కడే భార్య మృతి
* పోలీసులకు లొంగిపోయిన భర్త
* ఎచ్చెర్ల మండలంలో ఘటన

**శ్రీకాకుళం క్రైం/ఎచ్చెర్ల, మార్చి 18 (వార్త):** తాగిన మైకంలో కట్టుకున్న భార్యనే కడతేర్చిన ఘటన శ్రీకాకుళం జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఎచ్చెర్ల మండలం సంతసీతారాంపురం గ్రామానికి చెందిన నాగమ్మ(42).. భర్త అప్పలరెడ్డి చేతిలో సోమవారం రాత్రి హతమైంది. నాగమ్మ, అప్పలరెడ్డి స్వగ్రామంలో నివసిస్తున్నారు. నీలగిరి, సరుగుడు తదితర తోటలు కొడుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. అప్పలరెడ్డికి మద్యం తాగే అలవాటు ఉంది. నిరంతరం భార్యను అనుమానిస్తూ, అవమానిస్తుండేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఇంట్లో టీవీ చూస్తున్న నాగమ్మతో గొడవ పడ్డాడు. అంతటితో ఆగకుండా తోటలు కొట్టేందుకు వినియోగించే కత్తితో ఆమె తలపై, నుదుటిపై, మెడపై దాడిచేశాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. హత్య చేసిన అనంతరం అప్పలరెడ్డి తాను దాడి చేసిన కత్తితో పోలీసుస్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. మంగళవారం ఉదయం జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం, ఎస్ఐ వి.సందీప్‌కుమార్ సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. క్లూస్‌టీమ్ వివరాలు సేకరించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి పోలీసులు తరలించారు. అక్కడికి శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద కూడా చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. కుమారుడు త్రినాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎం.అవతారం తెలిపారు.

## బాలికపై మేనమామ లైంగికదాడి



**శ్రీకాకుళం క్రైం, మార్చి18(వార్త):** కవిటి మండలంలోని ఓ గ్రామానికి చిందిన పదేళ్ల బాలికపై మేనమామ అకృత్యానికి పాల్పడ్డాడు. పోలీసులు, గ్రామస్థులు అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడికి గతంలో వివాహం జరిగింది. అయితే భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మద్యానికి బానిసయ్యాడు. గ్రామంలో యువకుడి ఇంటికి కొద్ది దూరంలో బాలిక కుటుంబం నివసిస్తోంది. ఇటీవల బాలిక తల్లికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో శ్రీకాకుళంలోని ఆసుపత్రిలో చేర్పించారు. ఈ విషయం తెలుసుకున్న సదరు యువకుడు బాలికపై ఈ నెల 11న అకృత్యానికి పాల్పడ్డాడు. ఈ తరుణంలో బాలిక ఇబ్బంది పడు తుండడంతో గ్రామస్థులు తల్లికి సమాచారమిచ్చారు. దీంతో కుటుంబ సభ్యుల సహకారంతో సోమవారం కవిటి పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేసి కేసును నమోదు చేస్తామని ఇచ్ఛాపురం సీఐ ఎం.చిన్నంనాయుడు తెలిపారు.

## గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

**శ్రీకాకుళం క్రైం, మార్చి18(వార్త):** శ్రీకాకుళం నగర శివారులోగల తోటపాలెంకు చెందిన లొట్టి సురేష్ ఏపీహెచ్‌బీ కాలనీ మైదానంలో అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో ఒకటో పట్టణ ఎస్ఐ ఎం.హరికృష్ణ సిబ్బందితో వెళ్లి అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సురేష్‌పై కేసు నమోదు చేశారు.

### ఇద్దరు బైక్ దొంగలు..

అలాగే అరసవల్లి జంక్షన్ 80 ఫీట్ రోడ్డులో ద్విచక్ర వాహనాలు చోరీ చేసిన ఇద్దరు యువకులు ఒకటో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. స్థానిక మొండేటి వీధికి చెందిన డి.అఖిల్‌సాయి, ఎచ్చెర్ల మండలం ఏజీ పేటకు చెందిన భానుప్రసాద్ అనుమానాస్పదంగా తిరుగుతుండగా గుర్తించిన స్థానికులు పోలీసులు సమాచారమిచ్చారు. దీంతో ఒకటో పట్టణ ఎస్ఐ ఎం.హరికృష్ణ, సిబ్బందితో వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ద్విచక్రవాహనాలు దొంగతనం చేసినట్టు ఒప్పుకున్నారు. తుప్పల్లో దాచి ఉంచిన ద్విచక్ర వాహనాలను చూపించారు. శ్రీకాకుళం రూరల్ పరిధిలో రెండు వాహనాలు, ఎచ్చెర్లలో ఒకటి, రెండో పట్ట ణ పోలీసు స్టేషన్ పరిధిలో వాహనాన్ని చోరీ చేసినట్టు పేర్కొన్నారు.

## ఘనంగా పునీత్ రాజ్‌కుమార్ జయంతి వేడుకలు



**శ్రీకాకుళం, మార్చి 18(వార్త):** శ్రీకాకుళలో కన్నడ పవర్‌స్టార్ పునీత్ రాజ్‌కుమార్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి జిల్లాలో వివిధ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు సాయంత్రం శ్రీకాకుళంలో కేక్ కటింగ్ వివిధ హీరోల అభిమానుల సమక్షంలో నిర్వహించారు. పునీత్ రాజ్‌కుమార్ అసోసియేషన్ ఆదిక్షుడు పుక్కళ్ల నాగేంద్ర మాట్లాడుతూ జిల్లాలో ఆయన పేరుతో ఎన్నో సేవాకార్యక్రమాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అక్కినేని ఫ్యాన్స్ సంతోష్, మహేష్ బాబు ఫ్యాన్స్ సాజు, ఈశ్వర్, ప్రభాస్ ఫ్యాన్స్ గోపాల్, రాంచరణ్ ఫ్యాన్స్ సిద్దూ, వివిధ హీరోల అభిమానులు పాల్గొన్నారు.

# పెండింగ్ ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

**-కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**




**శ్రీకాకుళం, మార్చి 18(వార్త):** రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన పెండింగ్ ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రెవెన్యూ సదస్సులు, రీసర్వే ఫిర్యాదులు, ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ, ల్యాండ్ బ్యాంక్, కోర్టు కేసులు, వక్ఫ్ ఆస్తుల సర్వే వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. "పెండింగ్ లో ఉన్న పనులకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయండి, పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరుగుతుంది" అని కలెక్టర్ హామీ ఇచ్చారురైతులు ఎటువంటి ఇబ్బందులకు గురికాకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్దేశించిన, పూర్తి చేసిన గోకులాలపై ఆరా తీశారు. రానున్న రెండు రోజుల్లో వాటిని సైతం వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. మార్కెటింగ్, మత్స్య, ఉద్యాన, పరిశ్రమలు, గృహనిర్మాణ శాఖల టార్గెట్స్, అచీవ్మెంట్ పై ఆరా తీసి పనులు వేగవంతం చేయడానికి సూచనలు తెలియజేశారు. సాంఘిక సంక్షేమ శాఖ పై సమీక్షించి ఎంపీడీవోలు సంబంధిత సిబ్బందితో సమీక్ష నిర్వహించి వసతి గృహాల భవనాల మరమ్మతులపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎంపీడీవోలు గృహనిర్మాణాలకు సంబంధించి అర్హత కలిగిన లబ్ధిదారులకు మాత్రమే లబ్ధి చేకూరేలా చూడాలని, ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని సూచించారు. విద్యుత్ శాఖ పై సమీక్షలో భాగంగా ప్రధానమంత్రి సూర్య ఘర్ పై ప్రచారం, ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కృష్ణమూర్తికి సూచించారు. కాలువలు, చెత్త కుప్పల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర సాధనకు కృషి చేయాలని డీపీవో భారతి సౌజన్య సూచించారు. ఎన్ఆర్ఈజీఎస్ పనుల నిర్వహణ పై ఆరా తీశారు. పనిదినాల లక్ష్యాలను అధిగమించాలని ఆదేశించారు.

ఈ సమీక్షకు జిల్లా రెవిన్యూ అధికారి వేంకటేశ్వర రావు, ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, జడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, సీపీవో ప్రసన్నలక్ష్మి, టెక్కలి ఆర్డిఓ కృష్ణ మూర్తి, ఐసిడిఎస్ పీడి బి. శాంతి శ్రీ, డ్వామా పీడీ సుధాకర్, హౌసింగ్ పీడీ నగేష్, జిల్లాలోని ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, జిల్లా, మండల స్థాయి అధికారులు హాజరయ్యారు.




## ముగిసిన సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షలు

**ఇచ్ఛాపురం, మార్చి 18(వార్త):** జ్ఞానభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షలు ముగిశాయి. సెక్రటరీ సీఈవో జోహార్ ఖాన్ ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జోహార్‌ఖాన్ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో మైలురాయిగా నిలిచే పదవ తరగతి పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసినందుకు విద్యార్థులను అభినందించారు. పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులతో విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఇంటర్మీడియట్ నుండి నిర్ణయించుకున్న లక్ష్యాలు విద్యార్థి జీవితాన్ని నిర్ణయిస్తాయని అన్నారు. ఇంటర్మీడియట్ సి బి ఎస్ ఈ కోర్సులో చేరడం వల్ల కలిగే లాభాలను తెలియజేశారు. జ్ఞాన భారతి పాఠశాలలోనే 11వ తరగతిలో చేరడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. జ్ఞాన భారతిలో 12వ తరగతి 70% మార్కులతో ఉత్తిరిత సాధించిన విద్యార్థులకు హిందుస్థాన్ కంప్యూటర్స్ లిమిటెడ్ సంస్థలో ప్లేస్మెంట్స్ ఉంటాయని వివరించారు. ఈ అవకాశం పరిసర ప్రాంతాలలో ఎక్కడా లేదని తెలిపారు. పూర్తి స్థాయి కంప్యూటర్ ల్యాబ్స్, రోబోటెక్స్, లైబ్రరీ, విశాలమైన మైదానం వంటి అవకాశాలను వినియోగించుకునే అవకాశాన్ని విద్యార్థులు పొందాలని సూచించారు. త్వరలో ఉచితంగా అందించే బ్రిడ్జి కోర్సులకు హాజరుకావాలని విద్యార్థులను కోరారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టి వజ్రపు రమణమూర్తి , ప్రిన్సిపాల్ ఇందు భూషణ్ పండా, ప్రధానోపాధ్యాయురాలు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, ట్రాన్స్ పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్, అదనపు పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

# బాల కార్మికులను వినియోగిస్తే చర్యలు తప్పవు

**- పరిశ్రమల దారులు కార్మికులకు తగిన సౌకర్యాలు ఇవ్వాలి -మహిళలకు టాయిలెట్లు, విశ్రాంతి గదులు నిల్**

**-జీడి కార్మికులకు శ్రమ కార్డులు ఇవ్వాలి -పలాస లోని పలు జీడి పరిశ్రమల్లో రాష్ట్ర బాలల, మహిళా కార్మికుల పరిరక్షణ కమిషన్ తనిఖీలు**



**పలాస, మార్చి 18 (వార్త):** పలాస మున్సిపాలిటీ లోని జీడి పరిశ్రమంలో పనిచేసే కార్మికులకు, మహిళల పట్ల పరిశ్రమ యజమానులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషనర్ చైర్ పర్సన్ కేసరి. అప్పారావు మంగళవారం పలాస జంట పట్టణాల్లోని పలు జీడి పరిశ్రమలను తనిఖీలు చేశారు శ్రీకాకుళం జిల్లాలోని పలాస, మందస మండలాలో రెండు రోజులు పర్యటనలో భాగంగా మంగళవారం పలాసలోని అనంతపురం ఏరియాలో గల ఎస్ ఎస్ఎస్ జీడి పరిశ్రమ,ఇతర జీడి పరిశ్రమలను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. ఈ పరిశ్రమలలో మహిళలకి మరియు పురుష కార్మికులకు టాయిలెట్ సదుపాయాలు సిక్ రూమ్స్ మరియు ఇతర సదుపాయాలను పరిశీలించడం జరిగింది. తదుపరి ఎస్ ఎస్ ఎస్ జిడి పరిశ్రమలో ఉన్న కార్మికులకు ఈ శ్రమ కార్డును లేబర్ డిపార్ట్మెంట్ వారి సౌజన్యంతో చేయించాలని ఆదేశించడం జరిగింది. తదుపరి చిన్నచిన్న జీడి పరిశ్రమలలో వారి తల్లులతోపాటు ఐదు సంవత్సరాల లోపు బాలలను పరిశ్రమకి తీసుకురావద్దని వారిని అక్కడ దగ్గర్లోని అంగన్వాడీ సెంటర్లో చేర్పించాలని కార్మికులకి మరియు పరిశ్రమల యాజమాన్యానికి తెలియజేయడం జరిగింది. తదుపరి పలాస మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీసులో మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో పలాస రూరల్ మరియు అర్బన్ పరిధిలో ఉన్న మహిళా సంరక్షణ కార్యదర్శిలతో (మహిళా పోలీస్) లతో సమావేశం ఏర్పాటు చేసి, వాళ్ళు బాల్యవివాహం నిషేదంలో వారి పాత్ర మరియు వారి యొక్క విధులు బాధ్యతలు పై సమావేశం ఏర్పాటు చేసి తెలియజేయడం జరిగింది. .ఈ కార్యక్రమంలో జిల్లా బాలల రక్షణ అధికారి కెవి రమణ, సంస్థల బాలల రక్షణ అధికారి మెట్ట.మల్లేశ్వరరావు, సిడిపిఓ డి.పార్వతి, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీనివాస్ రావు, కాశీబుగ్గ సిఐ పి సూర్యనారాయణ, అసిస్టెంట్ లేబర్, ఐసిడిఎస్ సూపర్వైజర్ యు.లత, చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కోఆర్డినేటర్ కె శివాజీ పాల్గొన్నారు.

## ఆస్తి పన్ను వసూలుపై స్పెషల్ డ్రైవ్



**పలాస, మార్చి 18 (వార్త):** ఆస్తిపన్ను వసూలు విషయమై మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది, అన్ని సచివాలయాల అందరు సెక్రటరీలు, ఆర్పీలుతో ప్రత్యేక టీములతో మంగళవారం పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు సమావేశం నిర్వహించారు. ఆస్తి పన్ను వసూలు ను శత శాతం పూర్తి చేయాలని, సిబ్బంది ఎవరైనా అలసత్వం వహించినా.. శాఖా పరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ ఆస్థి పన్ను చెల్లింపులో పట్టణ ప్రజలు సహకరించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కోరారు. ఆస్థి పన్ను చెల్లింపు లో ప్రజలు ఎవరైనా సహకరించక పోయినట్లైతే అలాంటి మొండి బకాయిదారుల ఇంటి కుళాయి కనెక్షన్స్, విద్యుత్ కనెక్షన్ల తొలగింపు, డోర్ టు డోర్ చెత్త కలెక్షన్ తీసుకోకపోవడం జరుగుతుందని, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ యాక్ట్ 1965 ప్రకారం జప్తు చేయడం కూడా జరుగుతుందని తెలియజేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ ప్రభాకర్ రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అమర్, అన్ని సచివాలయంలో నోడల్ అధికారులు, అన్ని సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా తయారీకి సహకరించండి

**శ్రీకాకుళం, మార్చి 18(వార్త):** శ్రీకాకుళం తహశీల్దారు వారి కార్యాలయం, శ్రీకాకుళం నందు ఓటర్ల నమోదు అధికారి, నెం.5 శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గం, రెవిన్యూ డివిజనల్ అధికారిణి సాయి ప్రత్యూష అధ్యక్షతన మంగళవారం శ్రీకాకుళం నియోజకవర్గంలో వున్న అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులుతో సమావేశం ఏర్పాటు చేయడమైనది. ఈ సమావేశంలో ఎన్నికల సంఘం ఆదేశాలు ప్రకారం ప్రతి నెల మొదటి వారం నాడు అన్ని రాజకీయ పార్టీల వారితో మంచి ఓటర్లు జాబితా తయారీ చేయుటకు అన్ని రాజకీయ పార్టీల సమావేశం జరుగుతుందన్ని, 2% కంటే ఎక్కువ దూరం వున్న ఓటర్లు కు దగ్గరిలో వున్న పోలింగ్ కేంద్రం నకు షిఫ్టింగ్ / మెర్జ్ చేయుటక జరుగుతుందినీ తెలియ చేసి వున్నారు. అలాగే మంచి ఓటర్లు జాబితా తయారీకి అన్ని రాజకీయ పార్టీల వారు తగు సూచనలు ఇవ్వవలిసినదిగా తెలియచేసినారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం తహసిల్దార్ ఎస్. గణపతి రావు, శ్రీకాకుళం ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ జి. కె. శ్రీనివాసరావు, తహసీల్దార్, గార తాసిల్దార్ పద్మావతి, మాదారపు వెంకటేష్ – టీడీపీ, కుమారి –కాంగ్రెస్, ఏ.శ్రీనివాసరావు –వైఎస్ఆర్సిపి, ఆర్ .పురుషోత్తం – బిజెపి పాల్గొన్నారు.



## చెక్‌పోస్ట్ అధికారిపై చర్యలు నిలిపివేత

**శ్రీకాకుళం, మార్చి 18(వార్త):** పురుషోత్తపురం చెక్ పోస్ట్ వద్ద అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ ఎ. వాసుదేవ రావుపై ప్రభుత్వం విచారణను ముగించింది. 2017 మే 11న అవినీతి నిరోధక శాఖ నిర్వహించిన తనిఖీలో వాసుదేవరావు విధులకు గైర్హాజరైనట్లు తేలడంతో, ప్రభుత్వం ఆయనపై క్రమశిక్షణా చర్యలు చేపట్టింది. అయితే, విచారణలో ఆయన అవినీతికి పాల్పడినట్లు ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో కేసును మూసివేసింది.చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు అక్రమాలకు పాల్పడుతున్నారని, వాహనాలను తనిఖీ చేయకుండానే లంచాలు తీసుకుని అనుమతిస్తున్నారని ఏసీబీకి సమాచారం అందింది. దీంతో, వారు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో వాసుదేవరావు విధులకు గైర్హాజరైనట్లు గుర్తించారు. ఆయనపై ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ (ప్రవర్తన) నియమాలు, 1964లోని రూల్ 3(1), (2),ను ఉల్లంఘించినట్లు ఆరోపణలు వచ్చాయి. అయితే, విచారణ అధికారి సమర్పించిన నివేదికలో వాసుదేవరావుపై వచ్చిన ఆరోపణలు రుజువు కాలేదని తేలింది. అంతే కాకుండా, ఆయన కాంట్రాక్ట్ ఉద్యోగి కావడంతో, ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ (వర్గీకరణ, నియంత్రణ మరియు అప్పీల్) నియమాలు, 1991, ఆంధ్రప్రదేశ్ సవరించిన పెన్షన్ నియమాలు, 1980 ఆయనకు వర్తించవు. దీంతో, ప్రభుత్వం ఆయనపై క్రమశిక్షణా చర్యలను నిలిపివేస్తూ కేసును మూసివేసింది.

# అడివంటుకుంది

**-చీపి ప్రాంతంలోని అడవిలో అగ్ని ప్రమాదం**



**మందస, మార్చి 18(వార్త):** అడవి ప్రాంతంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఎండాకాలంలో తరచూ జరిగే అగ్నిప్రమాదాలు ప్రారంభమయ్యాయి. చీపి గ్రామానికి సమీపంలో రహదారికి ఆనించి ఉన్న అటవీ శాఖకు చెందిన రిజర్వ్ ఫారెస్ట్ లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో చెట్లు కాలి బూడిద అయ్యాయి. మందస నుంచి గిరిజన ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణీకులు దట్టమైన పొగకు ఇబ్బందులకు గుయారయ్యారు. రిజర్వ్ ఫారెస్ట్ లోని టేకు, నీలగిరి చెట్లు కాలిపోయాయి. గిరిజనులకు చెందిన జీడి మొక్కలు కూడా దగ్ధమయ్యాయి. ఇదే దారిలో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. రోడ్డు పైకి పొగలు కమ్ముకోవడంతో వాహనాలు, ద్విచక్ర వాహదారులు కూడా సమస్యలు ఎదుర్కొన్నారు. విద్యుత్ తీగలకు మంటలు తగులుతుండడంతో ముందు జాగ్రత్త చర్యగా విద్యుత్ నిలిపి వేశారు. మందస అగ్ని మాపక కేంద్రం సిబ్బంది చేరుకుని, మంటలు అదుపు చేశారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## అంగన్వాడీ కేంద్రాల పనివేళల మార్పు

**- ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహణ - ఐసీడీఎస్ పీడీ బి. శాంతి శ్రీ**

**శ్రీకాకుళం, మార్చి 18(వార్త):** అంగన్వాడీ కేంద్రాలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటాయని మహిళా శిశు సంక్షేమ శాఖ పథక సంచాలకులు బి. శాంతి శ్రీ మంగళవారం తెలిపారు. వేసవి దృష్ట్యా మార్చి నెల 18వ తేదీ నుండి మే నెల 31వ తేదీ వరకు అంగన్వాడీ కేంద్రాలు సమయం మార్చినట్లు పేర్కొన్నారు. ప్రీ స్కూల్ పిల్లలకు వేడి ఆహారం ఇచ్చి పిల్లలను వారి వారి గృహాలకు పంపాలని ఆమె తెలిపారు.






## శిక్షణను ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి

**శ్రీకాకుళం, మార్చి 18(వార్త):** ప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తున్న కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 18, 19 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న కంప్యూటర్ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా వస్తున్న సాంకేతికతను అలవర్చుకొని నైపుణ్యాభివృద్ధి చేసుకోవాలన్నారు. మారుతున్న కాలానుగుణంగా కార్యాలయాలకు ఉపయోగపడే ఆర్టిఫిషియల్ ఇంటిలిన్స్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఎక్సెల్ షీట్స్, తదితర వాటిపై కంప్యూటర్ లో శిక్షణ తీసుకొని సాంకేతికత నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని చెప్పారు.

## డ్రోన్ నిఘాతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట



**శ్రీకాకుళం, మార్చి 18(వార్త):** నదీ పరీవాహక ప్రాంతాలు, నిర్మానుష్యమైన ప్రదేశాలలో డ్రోన్ నిఘా పెట్టి,చట్ట వ్యతిరేక కార్యకలాపాలు అరికట్టే దిశగా మంగళవారం శ్రీకాకుళం ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ శ్రీ కె.వి మహేశ్వర రెడ్డి ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు డచ్ బంగ్లా, కంపోస్టు కోలని, దమ్మవిది, గుడివిది, పొట్టి శ్రీరాములు మార్కెట్ మరియు నాగావళి నది పరివాహక ప్రాంతాలు,పట్టణ చివర ప్రాంతాలలో బహిరంగంగా మద్యం సేవించడం ,గంజాయి సేవించడం,పేకాట, ఈవిటిజింగ్, చైన్ స్నాచింగ్, పేకాట , జూదం వంటి నేరాలు పై డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసి, పాడుపడిపోయిన బంగ్లాలు, నివాస గృహాలు పై డ్రోన్ కెమెరాలతో బహిరంగంగా మద్యం సేవించడం గంజాయి సేవించడం వంటి వారు పట్టుబడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుంది. పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహణ,ఈవ్ టీజింగ్, ఇతర నేరాలు జరగకుండా చర్యలు చేపట్టడం జరిగింది. బహిరంగంగా మద్యం సేవించడం గంజాయి వినియోగించిన పేకాట ఈవ్ టీజింగ్ తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలు కు పాల్పడినవారు పట్టుబడినట్లయితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి తెలిపారు.

## సమస్యల కొలువులో శివరంపురం

**పలాస, మార్చి 18(వార్త):** వజ్రపు కొత్తూరు మండలం నగరంపల్లి పంచాయతీ పరిధిలో శివరాంపురం గ్రామం సమస్యలతో కొట్టుమిట్టాడుతుందని సిపిఎం నాయకులు బమ్మిడి ఆనందరావు అన్నారు. మంగళవారం సిపిఎం పార్టీ ప్రతినిధి బృందం ఆ గ్రామంలో పాదయాత్ర చేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామ ప్రజలందరూ పూండి గల్లి వెళ్లడానికి ప్రధాన రహదారి సుమారు 750 మీటర్లు ఉన్నది దీనిని రోడ్డు రూపంలో లేకపోవడం వాహన చొధకులు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన గత పాలకులు 2018న ఆ రోడ్డు శంకుస్థాపన చేసి శిలాఫలకం వేశారు. మరల 2020లో మరో ప్రభుత్వం శంకుస్థాపన చేసి మరో శిలాఫలకం వేశారు. కానీ ఆ ఊరికి రోడ్డు మాత్రం ఒక్క ఇంచి కూడా వేయలేదు. అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ఊరు మూడు వీధులకి రెండు వీధులు గత సంవత్సరం నుండి కరెంట్ బల్బులు వెలగక, చినుకు పడితే చెత్తడిగా ఏర్పడి ఇండ్లకు చేరుకునే పరిస్థితి దారుణంగా ఉందని సిపిఎం పార్టీ ప్రతినిధి బృందం వద్ద ఆ గ్రామ ప్రజలు తమ ఆవేదనను వ్యక్తం చేశారని వారన్నారు. ఇంటింటికి ఇచ్చే కొళై కూడా చాలా బాగా లీకేజీలు ఉండటం వలన కొన్ని ఇండ్లకు నీరు చేరడం లేదని వారు అన్నారు. ఈ లీకేజీలు నీరు త్రాగడం వలన అనారోగ్యాలు బారిన పడుతున్నామని వారు అన్నారు. ఈ గ్రామంలో భర్తలు చనిపోయి సంవత్సరాలు గడుస్తున్న విడో పింఛను ఇప్పటికీ మంజూరు చేయకపోవడం శోచనీయమని వారు అన్నారు. కరెంట్ చార్జీలు గతం కంటే ఇప్పుడు ఎక్కువ వస్తుందని వారి బిల్లులు చూపించారు. కరెంటు కూడా ఎప్పుడు ఆగుతుందో ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితిని ఈ బృందం దగ్గర వాళ్లు గోడు వినిపించారు. పై సమస్యలు పరిష్కారం కోసం ఈ నెల 24వ తేదీన నగరంపల్లి సచివాలయం వద్ద ఆందోళన చేపడుతున్నట్టు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.మోహన్రావు, ఎన్ చంద్రయ్య టి భాస్కర్ రావులు, బి అప్పన్నతోపాటు ఆ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# పరిశ్రమల దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచొద్దు

**-పరిశ్రమల అధికారులకు కలెక్టర్ ఆదేశం**



**శ్రీకాకుళం, మార్చి 18(వార్త):** అనుమతులకు వచ్చే ధరఖాస్తులను పెండింగ్ లో ఉంచరాదని జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ ను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కార్యాలయ సమావేశ మందిరంలో పరిశ్రమలు మరియు ఎగుమతి ప్రోత్సాహం పై సంబంధిత అధికారులతో మంగళవారం ఆయన జూంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ డెస్క్ విండోకు సంబంధించి ఎన్ని దరఖాస్తులు వచ్చాయని జిఎంను అడుగగా 15 ధరఖాస్తులు రాగా 13 ప్రోసెస్ లో ఉన్నట్లు జిఎం విజయరత్నం చెప్పారు. పిఎంఇజిపిలో 69 లక్ష్యం కాగా 90 మంజూరు చేయడమైనదని ఇందుకు 4.39 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు జిఎం తెలిపారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ పురోగతి పై కలెక్టర్ ఆరా తీయగా 6599 మంజూరు చేయగా ఇందులో 5884 మందికి శిక్షణ పూర్తి చేయడమైని వీరిలో 1037 మందికి బ్యాంకు నుండి 10.37 కోట్ల రూపాయలను రుణంగా మంజూరు చేసినట్లు జిఎం విజయరత్నం వివరించారు. ఇండస్టియల్ డెవలప్మెంట్ పాలసీలో 54 యూనిట్లకు 2.12 కోట్ల రూపాయలను పరిశ్రమలు మరియు ఎగుమతి ప్రోత్సాహక కమిటీ మంజూరు చేశారు. ఎపిఐఐసి వద్ద ఉన్న భూమిని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ తో కలిసి పరిశీలించినట్లు తెలిపారు. ఎంఎస్ఎంఈ సర్వే పరిస్థితి పై కలెక్టర్ అడుగగా ఎంఎస్ఎంఈ సర్వేలో 66910 విద్యుత్ సర్వీసు కనెక్షన్లు గుర్తించి సర్వే పూర్తి చేసినట్లు కలెక్టర్ కు జిఎం వివరించారు. రణస్థలం మండలంలో అటవీ భూములపై డిఎఫ్ఓ వెంకటేష్, శ్రీకాకుళం ఆర్డీఓలతో చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ కె. విజయరత్నం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కరుణ శ్రీ, ఎపిఐఐసి జడ్ఎం ఎం. మురళీ మోహనరావు, అగ్నిమాపక శాఖ అధికారి మోహనరావు, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి. రాంబాబు, ఎడి రఘునాథ్, ప్రోత్సాహక అధికారులు డి. రవి కుమార్, ఎ. కిరణ్ కుమార్ ఎల్డీయం సూర్యకిరణ్, ఎపిఎంఐపి డిడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# ఎస్బీఐ పెన్షనర్ల సేవలు అమూల్యం



**శ్రీకాకుళం, మార్చి 18(వార్త):** ఎస్బీఐలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులు పెన్షనర్లు అసోసియేషన్‌గా ఏర్పడి, కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమని శ్రీకాకుళం నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతి శంకర్ అన్నారు. శ్రీకాకుళం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఎస్బిఐ పెన్షనర్ల అసోసియేషన్ నాలుగో వార్షికోత్సవ సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృత్తిలో నిరంతరము ఉంటూ పదవీ బాధ్యతలు అనంతరం ఉద్యోగ విరమణ చేసిన తర్వాత కూడా సేవా కార్యక్రమాలు, పెన్షనర్లు సమస్యలపై పోరాటం చేస్తూ వారి సమస్యను పరిష్కరించే దిశగా అసోసియేషన్ పనిచేస్తుందని ఇది అందరికీ ఆదర్శమని అన్నారు.

ఈ కార్యక్రమంలో అమరావతి సర్కిల్ జనరల్ మేనేజర్ హేమంత్ కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ సౌరవ్ గోస్, జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు స్వాతి శంకర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి, పెన్షనర్లు, పాల్గొన్నారు.

# మహిళలు, బాలికల రక్షణకే శక్తి యాప్



**శ్రీకాకుళం, మార్చి 18(వార్త):** శక్తి యాప్ మహిళలు, బాలికలు రక్షణకు ఎంతగానో ఆపద సమయంలో ఉపయోగపడుతుంది అని శక్తి యాప్ ఆవశ్యకత, ప్రాధాన్యత గురించి పాఠశాల,కళాశాల విద్యార్థులకు శక్తి బృందాలు విస్తృతస్థాయిలో అవగాహన కల్పించారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళలు భద్రత రక్షణ కొరకు అందుబాటులోకి తీసుకువచ్చిన శక్తి యాప్ ఉపయోగం, సేవలు, నిక్షిప్తం, రిజిస్ట్రేషన్ గురించి జిల్లాలో ప్రతి మహిళ, బాలికలకు, విద్యార్థులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ శ్రీ కేవీ మహేశ్వర్ రెడ్డి ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు మంగళవారం శ్రీకాకుళం పట్టణం తో పాటు టెక్కలి , కాశిబుగ్గ పట్టణ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు కళాశాల లను శక్తి బృందాలు సందర్శించి శక్తి యాప్ యొక్క ఆవశ్యకత ప్రాధాన్యత శక్తి యాప్ ద్వారా అందించే సేవలు ఇతర ఇతర వివరాలు గురించి విస్తృతస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శక్తి యాప్ టీముల యొక్క ఎస్ఐలు మాట్లాడుతూ ఆపద సమయంలో మహిళలు బాలికలు కు ఈ శక్తి యాప్ ఎంతగానో ఉపయోగ పడుతుందని ప్రతి మహిళ విద్యార్థులు బాలికలు మీ యొక్క సెల్ఫోన్లో ప్లే స్టోర్ నందు ఈ యాప్ ను డౌన్లోడ్ చేసుకుని వ్యక్తిగత వివరాలు ఫోన్ నెంబర్లతో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి సూచించారు. ఎస్ ఓ ఎస్ బటన్, డయల్ 112 నెంబర్ ద్వారా ఫిర్యాదు చేయగా పది నిమిషాల్లో మీ చెంతకు సంబంధిత పోలీస్ అధికారులు చేరుకొని మీయొక్క సమస్యను ,ఆపదను పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతామని తెలిపారు.మహిళలు , చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాలు పై డయల్ 100,112, చైల్డ్ లైన్ 1098, గృహ హింసా 181, మహిళ వేధింపులు 1091,సైబర్ టోల్ ఫ్రి 1930, సైబర్ మిత్ర, సంబంధిత పోలీసు వారికి తక్షణమే సంప్రదించి పోలీసు వారు సేవలను సద్వినియోగం చేసుకోవడం సూచించారు. అదేవిధంగా శక్తి టీమ్ సిబ్బంది పబ్లిక్ ప్రదేశాలు, పట్టణ,గ్రామాలు బస్టాండ్ సందర్శించి మహిళలు విద్యార్థులకు ప్రయాణికులకు శక్తి యాప్ యొక్క ఉపయోగాన్ని తెలియజేసి వారి వారి ఫోన్లు శక్తి యాప్ నిక్షిప్తం చేయించి, రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## భక్తిశ్రద్ధలతో హరే రామ..హరే కృష్ణ సంకీర్తన

**ఇచ్ఛాపురం, మార్చి 18(వార్త):** ప్రతి ఒక్కరూ హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన చేయాలని ఇస్కాన్ కి చెందిన భక్తి వికాస స్వామి మహరాజ్ అన్నారు. స్థానిక సురంగి రాజా మైదానం లో శ్రవణ కీర్తన మహోత్సవం జరిగింది.నగర సంకీర్తన, ప్రవచనాలు జరిగాయి.

అనంతరం నిర్వహించిన నాటిక ఆకట్టుకుంది. భక్తులు వేల సంఖ్యలో పాల్గొన్నారు. అన్న ప్రసాద కార్యక్రమం జరిగింది.



# టీడీపీలోకి కొత్తూరు వైసీపీ నేతలు



**కొత్తూరు, మార్చి 18(వార్త):** మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పాతపట్నం నియోజకవర్గంలో వైస్సార్సీపీ భారీ ఓటమిని మరవకముందే నియోజక వర్గంలో వైసిపికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కొత్తూరు మండల వైయస్సార్సిపి కీలక నేతలు ఆ పార్టీకి గుడ్ బై చెప్పి మంగళవారం నాడు విజయవాడలో పాతపట్నం శాసనసభ్యుడు మామిడి గోవింద రావు సమక్షములో వారిని టిడిపి కండువాలు కప్పి తెలుగుదేశం పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కొత్తూరు మండలంలోని కొత్తూరు గ్రామ పంచాయితీ సర్పంచ్ ప్రతినిది పడాల లక్ష్మణరావు ( శర్ల ),మాజీ హిరమండలం ఏయంసి చైర్మన్ ప్రతినిది గోగుల వరప్రసాద్ నాయుడు ,పారాపురం మాజీ ఎంపిటిసి కుంచాల నూకరాజు,పారాపురం సర్పంచ్ ప్రతినిది కుంచాల తవిటినాయుడు,మండల యువ నాయకుడు పప్పల.కేశవ్, వార్డ్ సబ్యులు కొమనపల్లి హేమంత్,లక్ష్మణరావు తదితరులు టిడిపి లో చేరడం జరిగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు,రాష్ట్ర అభివృద్ధికి అలాగే మా పాతపట్నం నియోజకవర్గనికి స్థానికుడు, సమాన్యుడు, సేవా తత్పరుడైన ఎమ్మెల్యే ఎంజీఆర్ పనితీరుపై నమ్మకంతో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పాతపట్నం నియోజకవర్గానికి ముఖ్యంగా కొత్తూరు మండలానికి కీర్తిశేషులు గోగుల చల్లంనాయుడు చేసిన సేవలు ఎనలేనివని తన కుమారుడు గోగుల వరప్రసాద్ నాయుడు నాకు సోదర సమానుడని, కొత్తూరు సర్పంచ్ పడాల లక్ష్మణరావు నా తోటి సహోదరుడని వీరు టిడిపిలో చేరడం నాకు చాల ఆనందంతో పాటు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతమైందని ఈ సందర్భముగా తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ మండల నాయకులు అగతముడి మాధవరావు,అగతముడి అరుణ్ బాబు, కొత్తూరు ఎంపిటిసి టోంపల తిరుపతిరావు, మాజీ ఎంపిటిసి యల్ జనార్ధన్, చింతాడ కోటి,ముగితి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డున పడబోతున్న 4500 కుటుంబాలను ఆదుకోండి

**-ఆంధ్ర ప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ విజ్ఞప్తి**

**- పలాస విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కి వినతి**

**పలాస, మార్చి 18(వార్త) :** విద్యుత్ శాఖను నమ్ముకొని గత 15 నుండి 20 సంవత్సరాలుగా విద్యుత్ మీటర్ బిల్లులు తీస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు అయోమయ పరిస్థితుల్లో ఉన్నారు. ప్రస్తుతం ఉన్న ఇ అర్ మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్ల బిగిస్తున్న నేపథ్యంలో తమ జీవనోపాధి కొల్పోతున్నామని మీటర్ రీడర్లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. విద్యుత్ శాఖకు ఆర్థిక వనరులుగా ఉన్న తమని ప్రభుత్యం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం శాఖా పరంగా తీసుకొంటున్న నిర్ణయాలను తాము గౌరవిస్తామని, తమ జీవనోపాధిని దృష్టి లో పెట్టుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల తాము ఉద్యోగ భృతిని కోల్పోతున్నామని, చాలీ చాలని జీతాలతో విద్యుత్ శాఖని నమ్ముకొని జీవిస్తున్న తమకు న్యాయం చేయాలని మీటర్ రీడర్లు




డిమాండ్ చేస్తున్నారు. కరోనా వ్యాధి ప్రభలిస్తున్న విపత్కర పరిస్థితుల్లో కూడా ఇంటింటి కి వెళ్లి బిల్లులు ఇచ్చిన తమని ఇప్పుడు నిర్లక్ష్యం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రీడింగ్ తీసే సమయాన్ని దశల వారీగా కుదిస్తూ వచ్చిన యజమాన్యం తమని వదల్లేదని, ప్రస్తుతం 1 నుండి 12 వ తేదీకి బిల్లులు ఇవ్వాలని తీసుకున్న నిర్ణయాన్ని కూడా స్వాగతించి కష్టపడుతున్నామని వారు స్పష్టం చేశారు.ఈ క్రమంలో ఆరోగ్యం బాగోక పోయినా , కుటుంబంలో శుభకార్యం, అశుభకార్యం జరిగా బిల్లులు తీయాల్సిన పరిస్థితుల్లో ఉన్నామని బిల్ రీడర్లు వాపోతున్నారు. దీనివల్ల ఆర్థిక స్తోమత లేక మానసికంగా చాలా కష్టపడుతున్నారు అని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో మీటర్ రీడర్లకు విద్యుత్ సంస్థలోనే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని, ఎస్క్రో ఎకౌంటు ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు తమ న్యాయమైన డిమాండ్లను సాధించుకోవాలని (మంగళవారం)పలాస విద్యుత్ శాఖ డి ఈకి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమం లో ఏఐటియుసి పలాస డివిజన్ నాయకులు చాపర వేణుగోపాల్ శ్రీకాకుళం జిల్లా మీటర్ రీడర్స్ అధ్యక్షులు ఆర్. కుమార్ స్వామి, మీటర్ రీడర్స్ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి శ్రీ దూగాన. భాస్కర రావు, పలాస డివిజన్ అధ్యక్షులు శ్రీ బి ఓంకార్, పలాస డివిజన్ కార్యదర్శి కే నరేష్, సోంపేట, పలాస సబ్ డివిజన్ మీటర్ రీడర్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణతో మాలలు, రెల్లిలకు అన్యాయం

**- ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు**

**డా.కంఠ వేణు, తైక్వాండో శ్రీను, అర్జి కోటి**

**శ్రీకాకుళం, మార్చి 18(వార్త):** ఎస్సీ వర్గీకరణతో మాలలకి, రెల్లిలకు వాటి అనుబంధ కులాలకి అన్యాయం జరుగుతుందని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు డా.కంఠ వేణు, తైక్వాండో శ్రీను, రెల్లి కుల సంక్షేమ సంఘం నాయకులు అర్జి కోటిలు ఆవేదన వ్యక్తం చేసారు. రాష్ట్రం యూనిట్ గా ఎస్.సి వర్గీకరణకి ఎన్ డిఏ కూటమి సిద్దపడడాన్ని వారు తప్పుపట్టారు. సమగ్ర కులగణన లేకుండా ఎస్.సిలను ఎలా వర్గీకరిస్తారంటూ ధ్వజమెత్తారు. శ్రీకాకుళంలోని ఎన్‌జిఓ హోంలో మంగళవారం మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. 2011 జనాభా లెక్కల ప్రకారం నూతన ఆంధ్రప్రదేశ్ లో ఎస్సీ వర్గీకరణ చేపట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. 2025 నాటికి ఆంధ్రప్రదేశ్ లో మాలలు,రెల్లిలు వాటి అనుబంధ కులాల జనాభా ఎంతగానో పెరిగిందని ఆ లెక్కలను పరిగణలోకి తీసుకోకుండా 14 యేళ్ళ క్రితం నాటి(2011) జనాభా లెక్కలను ఎన్ డిఏ కూటమి ప్రభుత్వం ఎలా పరిగణలోకి తీసుకుంటుందని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణకి సంబందించి సుప్రీంకోర్టు వెల్లడించిన తీర్పులో ఎంపరికల్ డేటాను




పరిగణలోకి తీసుకోవాలని చెప్పిందని,కూటమి ప్రభుత్వం ఆ డేటాని పరిగణలోకి తీసుకోలేదని ఆరోపించారు. ఎంపరికల్ డేటాకి బదులుగా 2011 జనాభా లెక్కలు పరిగణలోకి తీసుకోవడం సరికాదన్నారు. ఎస్.సి వర్గీకరణకి సంబందించి మెజార్టీ దళిత ఎమ్మెల్యేలు జిల్లా యూనిట్ గా వర్గీకరణ చేయాలని కోరుతున్నా రాష్ట్ర యూనిట్ గా చేసేందుకు కూటమి ప్రభుత్వం ఉత్సాహాన్ని చూపిస్తుండడం మాదిగలకి లబ్ధిచేకూర్చేందుకేనని వారు ఆరోపించారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను తీసుకుని మాల సామాజిక వర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేల అభిప్రాయాలను మాటలను ప్రభుత్వ పెద్దలు లెక్క చేయకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలిచిన మాదిగలకి లబ్ధి చేకూర్చేందుకే రాష్ట్రం యూనిట్ గా ఎస్.సి వర్గీకరణ చేయాలని ప్రభుత్వం చకచకా అడుగులు వేస్తున్నట్లుగా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయని వారు పేర్కొన్నారు. రాజీవ్ రంజన్ మిశ్రా నివేదకపై ఈ నెల 20న అసెంబ్లీలో చర్చించనున్న నేపధ్యంలో సమగ్ర కులగణన నిర్వహించిన తర్వాతనే ఎస్.సి వర్గీకరణపై నిర్ణయం తీసుకోవాలని వారు డిమాండ్ చేసారు. మాలలు,రెల్లిలు,వాటి అనుబంధ ఉపకులాల వారికి అన్యాయం జరిగితే ఆ సామాజిక వర్గాల ఆగ్రహానికి కూటమి గురికాక తప్పదని వారు హెచ్చరించారు. ఎస్.సి వర్గీకరణ విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. లేనిపక్షంలో మేధావులతో చర్చించి వర్గీకరణపై న్యాయం పోరాటం చేసేందుకు రెడీగా ఉన్నామని డా.కంఠ వేణు,తైక్వాండో శ్రీను,అర్జి కోటిలు తెలియజేసారు. ఈ మీడియా సమావేశంలో ఎస్.సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు యజ్జల గురుమూర్తి, సింకి రమణ,పెయ్యల చంటి, ఎస్. సూర్యనారాయణ , అబ్బాస్ , అర్జి ఈశ్వరరావు,దూళి మోహన్ , తిరుపతిరావు, రామ్మోహన్ రావు, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



## ఆస్తి తగాదాలో మహిళపై దాడి

**సంతబొమ్మాళి, మార్చి 18(వార్త):** మలగాం పంచాయతీ దేపల్లివానిపేట లో ఆస్తి విషయమై తగాదా జరగడంతో మహిళపై దాడి చేయడంతో అపస్మారస్థితి లోకి వెళ్ళిపోయింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం తన తల్లి ఎరుపల్లి కామమ్మ ఆధీనంలో ఉన్న ఆస్తిని ఆమె మరణానంతరం గ్రామానికి చెందిన ఎరుపల్లి లక్ష్మణరావు, అతని బంధువులు దౌర్జన్యంగా కబ్జా చేయడానికి మంగళవారం ప్రయత్నించాడు. గొయ్యిలు తీసి సిమెంటు స్తంభాలను పాతి చుట్టూ ఫెన్సింగ్ వేయడానికి ప్రయత్నించగా కామమ్మ కుమార్తెలు దేపల్లి రాజమ్మ, నందుపిల్లి సీతమ్మ అడ్డుకున్నారు. మా స్థలంలో కంచె వేయడానికి ఏమి హక్కు ఉన్నది, ఏమైనా పత్రాలు ఉంటే గ్రామ పెద్దలకు చూపించాలని కోరారు. పెళ్లిళ్లయి అత్తారింటికి వెళ్లిపోయిన మీరు ఇక్కడికి వచ్చి అడగడం ఏమిటంటూ ఎరుపల్లి లక్ష్మణరావు తో పాటు పార్వతి, తాతయ్య లక్ష్మమ్మ , అప్పమ్మ, తదితరులు దాడి చేశారు. ఈ దాడిలో దేపల్లి రాజమ్మ ను కొట్టి బలవంతంగా నెట్టడంతో ఫెన్సింగ్ కోసం తెచ్చిన సిమెంట్ స్తంభాలపై పడడంతో తలకు బలమైన గాయమై అపస్మారస్థితికి చేరుకుంది. గాయమైన రాజమ్మను టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్ హాస్పిటల్ కు తరలించారు .దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సంతబొమ్మాళి పోలీసులు తెలిపారు.

## నేడు హరిపురంలో వంశధార జల సాధన కమిటీ సమావేశం

**మందస, మార్చి 18(వార్త):** మందస మండలంలోని హరిపురంలో గల మార్పు గ్రంధాలయంలో ఈ నెల 19న వంశధార జల సాధన కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ముక్తకంఠంతో, పార్టీలకు అతీతంగా వంశధార నీటిని పంట సాగుకు కార్య సాధనకు ఒక నిర్ధిష్ట ప్రణాళిక రూపకల్పనకు ఉదయం 9గంటలకు తప్పక హాజరు కావాలని వారు కోరారు.

### డ్రగ్ కంట్రోల్ అథారిటీ కార్యాలయానికి

## రూ.92 లక్షల మంజూరు

**శ్రీకాకుళం, మార్చి 18(వార్త):** శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఔషధ నియంత్రణ కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. నియంత్రణ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వం సవరించిన పరిపాలనా అనుమతిని మంగళవారం జారీ చేసింది. ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ శాఖ ఈ మేరకు జీవో ఆర్. టి 156 విడుదల చేసింది. డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ ప్రతిపాదనల మేరకు, కేంద్ర ప్రాయోజిత పథకం (సి ఎస్ ఎస్) కింద రాష్ట్ర ఔషధ నియంత్రణ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఈ సవరణ చేశారు.అసలు మంజూరు చేసిన మొత్తం 81.60 లక్షలు కాగా, టెండర్ తగ్గింపు మొత్తం 0.75 లక్షలు కలిపి సవరించిన మొత్తం 92.22 లక్షలకు చేరింది. నిబంధనలకు అనుగుణంగా ఔషధ నియంత్రణ వ్యవస్థను బలోపేతం చేయడం ఈ సవరణ ముఖ్య ఉద్దేశం.

## అత్యవసర సమాచార సేకరణకు మొబైల్

**శ్రీకాకుళం, మార్చి 18(వార్త):** శ్రీకాకుళం సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి ప్రసూతి విభాగంలో అత్యవసర సమాచార సేకరణకు ఓ నూతన కార్యక్రమాన్ని ప్రసూతి విభాగాధిపతి డా. డి.పార్వతి వారి ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బాలమురళీకృష్ణ, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.వెంకటాచలంతో మొబైల్ నంబర్‌ను ప్రారంభించారు. ఈ ఫోన్ నంబర్ ద్వారా పల్లె ప్రాంతాల నుండి అత్యవసర పరిస్థితుల్లో గర్భిణీ స్త్రీలను రిఫర్ చేసేటప్పుడు ఆ సంబంధిత కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నుండి ఆ రోగి ఆరోగ్య పరిస్థితిని, ప్రధమ చికిత్స, రక్తం గ్రూపు అండ్ మోతాదు సమాచారాన్ని ముందస్తుగా చేరవేయడం ద్వారా ఆ గర్భిణీ స్త్రీలను, నవజాతాశిశు మరణాలను తగ్గించుటకు ఈ ఫోన్ నంబర్ కార్యక్రమం (అత్యవసర సమాచార సేకరణ కార్యక్రమం) ద్వారా ఎంతో తోడ్పడుతుందని ప్రారంభించారు. ఈ ఫోన్ నంబర్ ను డిఎం హెచ్ఓ ఆఫీస్ ద్వారా అన్ని సిహెచ్ సి లకు అందిస్తామని డిసిహెచ్ఎస్ డా.కళ్యాణ్ బాబు తెలిపారు. ముఖ్యంగా ఐరిస్క్ ప్రొగ్రామ్ మహిళలకు త్వరితగతిన సేవలందించి జిల్లాలో ప్రసూతి మరణాల రేటును తగ్గించవచ్చునని, ప్రసూతి విభాగాధిపతి డా. డి.పార్వతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గైనిక్ ప్రసూతి విభాగంలో ఉన్న డాక్టర్లు, స్టేప్ నర్సులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546